ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జనగామ

గురువారం 2 మే 2024



ఉచిత బస్సు తప్ప.. అంతా ఉత్తుత్తే..

కాంగ్రెస్ దుష్ట పరిపాలనలో హామీలేవీ నెరవేరడం లేదు

- మానుకోట జిల్లా ఉండాలంటే. బీఆర్ఎస్ గెలవాలె..
- బస్సుయాత్ర, కార్నర్ మీటింగ్‌లో మాజీ సీఎం కేసీఆర్

మహబూబాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ దుష్ట పరిపాలనలో ఉచిత బస్సు తప్ప.. ఇతర హామీలేవి అమలు కావడం లేదని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ సీఎం కేసీఆర్ నిర్వహిస్తున్న బస్సుయాత్ర బుధవారం సాయంత్రం భద్రాద్రికొత్తగూడెం జిల్లా కేంద్రం నుంచి రాత్రి 7.10గంటలకు మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. కానీ ఆయన ప్రచారంపై బుధవారం రాత్రి 8గంటల నుంచి 48 గంటల పాటు ఎన్నికల కమిషన్ నిషేధం విధించిన నేపథ్యంలో.. 7.20గంటలకు ఇందిరాగాంధీ సెంటర్‌కు చేరుకున్న ఆయన.. 14 నిమిషాల పాటు ప్రసంగించారు.

తాను మారుమూల గిరిజన ప్రాంతమైన మహబూబాబాద్‌ను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తే.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేస్తామని స్పష్టంగా చెబుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వీటన్నింటికీ బ్రేక్ వేయాలంటే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. తన ప్రచారంపై 48 గంటల పాటు నిషేధం విధిస్తే.. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు 96 గంటలు అవిశ్రాంతంగా పనిచేస్తారని కేసీఆర్ స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పాలనలో రైతులు నష్టపోతున్నారని, కరీంనగర్ జిల్లాలో వడ్లు కొనడం లేదని, వాటిని ఆరబెట్టుకున్న ఓ రైతు కుప్పకూలి గుండె ఆగి మృతి చెందాడని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత బస్సు పథకంతో ఆటోరిక్షా కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ 50 ఏళ్ల పాలనలో ఈ ప్రాంతానికి ఎన్నడు నీళ్లు రాలేదని, వెన్నవరం కాలువల ద్వారా చుక్క నీరు రాలేదని, కాళేశ్వరం కట్టిన తర్వాతనే వెన్నవరం కాలువల ద్వారా నీళ్లు వచ్చాయని వివరించారు. ఈ ఏడాది కాళేశ్వరం ప్రాజెక్టు నీరు ఎందుకు రాలేదంటూ ప్రజలను ఈ సందర్భంగా కేసీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం చూపిస్తోందని, రైతుబంధు ఇవ్వడం లేదని, అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిందన్నారు. తెలంగాణకు న్యాయం చేసేందుకు తనగొంతులో ప్రాణం ఉన్నంత వరకు పోరాడుతానని స్పష్టం చేశారు. బీజేపీ మోదీ ప్రభుత్వం గోదావరి నీళ్లను తీసుకుపోతోందని, సీఎం రేవంత్‌రెడ్డి మౌనంగా ఉన్నారని మండిపడ్డారు. మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేటల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందని, ఖమ్మంలో మురికినీరు వస్తోందని విచారం వ్యక్తం చేశారు. కరెంట్, భగీరథ పథకాలు ఎక్కడికి పోయాయయని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గిరిజనులను గౌరవించలేదని, మహబూబాబాద్ ప్రాంతంలో సేవాలాల్ దేవాలయాన్ని బీఆర్ఎస్ పాలనలో నిర్మించామని, గిరిజనులకు రిజర్వేషన్లను కల్పించామని కేసీఆర్ పేర్కొన్నారు.

ఈ కార్నర్ మీటింగ్‌లో మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత, ఎమ్మెల్సీలు వద్దిరాజు రవిచంద్ర, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, సత్యవతిరాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్.రెడ్యానాయక్, బానోత్ శంకర్‌నాయక్, హరిప్రియ, రేగ కాంతారావు, మానుకోట, ములుగు జడ్పీ చైర్‌పర్సన్‌లు అంగోతు బిందు, బడె నాగజ్యోతి తదితర నేతలు పాల్గొన్నారు. కాగా, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ కేంద్రంలో జరిగిన రోడ్ షోకు జనం భారీగా తరలిరావడంతో నేతలు హర్షం వ్యక్తం చేశారు.

భద్రాద్రి జిల్లా నుంచి మానుకోటకు చేరుకున్న కేసీఆర్‌కు పట్టణ శివార్లలో నేతలు ఘన స్వాగతం పలికగా బస్సులో నుంచే అభివాదం చేస్తూ ఇందిరాగాంధీ సెంటర్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ తెలంగాణ పాటలకు నృత్యాలు చేశారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

వీసీలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారితో కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్లు

జనగామ కల్చరల్, మే 1: పార్లమెంటు ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేపడుతున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో పార్లమెంటు ఎన్నికల నిర్వహణ తీరును హైద్రాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, అదనపు ఎన్నికల అధికారులు, ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్లమెంటు ఎన్నికల తీరును కలెక్టర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. జిల్లాలో 3 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయని, జనగామ, యాదాద్రి భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోనూ, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలోనూ ఉన్నాయన్నారు. ఓటరు సమాచార స్లిప్‌లను బీఎల్‌వోలతో ఇంటింటికీ తిరిగి అందజేస్తున్నామన్నారు. పోలింగ్ అధికారులకు పోలింగ్ పై శిక్షణ ఇచ్చామని అన్నారు. చెక్ పోస్టుల వద్ద నిఘా పెంచామన్నారు. సి-విజిల్, 1950 కాల్‌సెంటర్ ద్వారా వస్తున్న ఫిర్యాదులు నమోదు చేస్తూ పరిష్కరిస్తున్నామన్నారు. పోస్టల్ బ్యాలెట్ స్వీకరణకు నియోజకవర్గ పరిధిలో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్, ఆర్‌డీవోలు కొమురయ్య, వెంకన్న, అనిల్ కుమార్, నరేంద్ర, శ్రీనివాసరావు, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా హెచ్చరించారు. బుధవారం ఆయన శివునిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో మాట్లాడారు. ఎన్నికల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ యంత్రాల పట్ల పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలన్నారు. పోలింగ్ రోజున ఉదయం వివిధ పార్టీలకు చెందిన ఏజెంట్ల సమక్షంలో మాక్‌పోలింగ్ నిర్వహించాలన్నారు. పీవోలు, ఏపీవోలు ప్రతీ అంశాన్ని పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, అంజనేయులు, డీటీలు విజయ్‌కుమార్, రాజేష్‌కుమార్, హరిప్రసాద్, ఆర్ఐలు అర్జున్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పీవోలకు శిక్షణ ప్రారంభం..

పాలకుర్తి: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో రెండో విడతలో భాగంగా మూడు రోజుల పాటు పీవోలకు శిక్షణా కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్, ఏఆర్‌వో రోహిత్‌సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా ఉండొద్దని అన్నారు. పోలింగ్ రోజున రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను తప్పకుండా పాటించాలని అన్నారు. అధికారులకు ఈవీఎం, వీవీప్యాట్‌లను చూపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశం, డీటీ రామారావు, రాకేష్ పాల్గొన్నారు.

అరూరికి ఓటమి భయం పట్టుకుంది..

- అందుకే చిల్లర మాటలు మాట్లాడుతున్నాడు..
- ఎర్రబెల్లి, అరూరిని మడతబెట్టిన నియోజకవర్గాల ప్రజలు
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యాఖ్యలు

7లో



వర్ధన్నపేటలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి, పక్కన అభ్యర్థి కావ్య, ఎమ్మెల్యే నాగరాజు

లోక్‌సభ ఎన్నికల్లో ఆశీర్వదించండి..

- దళితులను ముట్టుకోని వ్యక్తి కడియం కావ్య
- పదవులు అనుభవించి కేసీఆర్‌కు కడియం వెన్నుపోటు
- వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్
- ఏనుగల్లు, పర్వతగిరిలో కార్నర్ మీటింగ్‌లు

7లో



పర్వతగిరి కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న అరూరి రమేష్

దేవుడిపై ఒట్లు.. కేసీఆర్‌పై తిట్లు..

- ఇదే సీఎం రేవంత్‌రెడ్డి పనితీరు
- అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- వర్ధన్నపేట మండలంలోని సుధీర్‌కుమార్‌తో కలిసి ప్రచారం



చెన్నారంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వర్ధన్నపేట రూరల్, మే 1: దేవుడిపై ఒట్టు వేసి కేసీఆర్‌ను తిట్టడమే సీఎం రేవంత్‌రెడ్డి నిత్యం పనిగా పెట్టుకున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎద్దేవా చేశారు. బుధవారం వర్ధన్నపేట మండలంలోని చెన్నారం, నల్లబెల్లి, ఉప్పరపెల్లి, రాంధాన్ తండా, కట్ర్యాల, ఇల్లంద, బండౌతపురం, దమ్మన్నపేట, రామవరం, కొత్తపెల్లి గ్రామాల్లో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి, సంక్షేమం కనపడిందని, కాంగ్రెస్ వచ్చాక ఆగం, అధోగతి కనిపిస్తోందని ఆరోపించారు. చల్లగా ముందుకు పోతున్న రాష్ట్రాన్ని ఆగం చేసిన కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మి మళ్లీ మోసపోవద్దని ప్రజలకు సూచించారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయించాలంటే ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఒక ఉద్యమకారుడికి.. ఇద్దరు మోసగాళ్లకు మధ్య జరుగుతున్న ఎన్నికలు ఇవని గుర్తుచేశారు. తెలంగాణ కోసం గొంతెత్తి, తెలంగాణ హక్కులు కాపాడేది బీఆర్ఎస్ మాత్రమేనని, అందుకే పార్లమెంటులో బీఆర్ఎస్ గళం వినిపించడానికి గులాబీ దళం ఉండాలన్నారు. మార్పు అనగానే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారని, కానీ, రుణమాఫీ, రైతు బంధు, మహిళలకు రూ.2500 వచ్చాయా.. అంటూ ప్రశ్నించారు. మార్పు కావాలని కోరుతున్న ప్రజలకు మార్పు రాలేదని, కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలతో అరచేతిలో వైకుంఠం చూపించిందన్నారు. ఇప్పుడు మళ్లీ కొత్తగా రుణమాఫీ పేరిట రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్లు వేసి ఓట్లు అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీలకు ఎందుకు ఓటు వేయాలో చెప్పకుండా దేవుడిపై ఒట్లు వేసి రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్ పార్టీకి చేసిన మోసానికి శాశ్వతంగా రాజకీయ సమాధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీలో చేరిన అరూరి రమేష్ సైతం వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలను మోసం చేశాడని, వీరికి ఓటు తోనే సమాధానం చెప్పాలని సూచించారు. కాంగ్రెస్ రాగానే రైతులు, నేతన్నల ఆత్మహత్యలు పెరిగిపోయాయని ఆరోపించారు. రోజు విద్యుత్ సరఫరాలో అంతరాయం, మోటార్లు కాలడం మళ్లీ ప్రారంభమయ్యాయని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీ, కాంగ్రెస్‌ల తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలన్నారు.



దమ్మన్నపేటలో మాట్లాడుతున్న సుధీర్‌కుమార్, పక్కన ఎర్రబెల్లి దయాకర్‌రావు

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను నమ్మొద్దు..
- సుధీర్‌కుమార్

బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మాయమాటలు నమ్మి ప్రజలు మరోసారి మోసపోవద్దని వరంగల్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమకారుడినైన తనను కేసీఆర్ పిలిచి ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టడం సంతోషంగా ఉందన్నారు. కడియం శ్రీహరి, అరూరి రమేష్, పసునూరి దయాకర్‌లు బీఆర్ఎస్ పార్టీకి వెన్నుపోటు పొడిచారని గుర్తు చేశారు. వీరిని పదేండ్ల పాటు అందలం ఎక్కించి పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించేలా చేస్తే తమ స్వార్థ రాజకీయాల కోసం పార్టీ నాయకులను, కార్యకర్తలను ఆగం చేశారని తెలిపారు. మళ్లీ బీఆర్ఎస్ పార్టీకి మంచి రోజులు వస్తాయని, నాయకులు, కార్యకర్తలు నిరాశ చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎంపీ అభ్యర్థిగా భారీ మెజారిటీతో గెలిపించేలా గులాబీ సైనికులు పనిచేయాలని కోరారు.

ఈ సమావేశంలో ఎంపీపీ అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, వైస్ ఎంపీపీ సోమలక్ష్మి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం వద్ద కేసీఆర్ పాపాల చిట్టా

- ఆయన కుటుంబం జైలుకెళ్లడం ఖాయం
- పల్లా రాజేశ్వర్‌రెడ్డి దొంగ ఓట్లతో గెలిచాడు
- కాంగ్రెస్ భువనగిరి పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



బచ్చన్నపేటలో మాట్లాడుతున్న మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

బచ్చన్నపేట, మే 1: తమ ప్రభుత్వం వద్ద కేసీఆర్ పాపాల చిట్టా మొత్తం నమోదై ఉందని, అవినీతిలో కూరుకుపోయిన వారి కుటుంబ సభ్యులు త్వరలో జైలుకెళ్లడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి బచ్చన్నపేటలో ఆయన కార్నర్ మీటింగ్ నిర్వహించారు. గోపాల్‌నగర్ చౌరస్తా నుంచి బచ్చన్నపేట చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించగా, వివిధ గ్రామాల నుంచి వందలాదిగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జనగామ ఎమ్మెల్యే పల్లా

మిగతా 8వ పేజీలో...

బీజేపీని ఓడించడమే లక్ష్యం

- సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి
- జిల్లాలో ఘనంగా మేడే
- కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జెండా విష్కరణలు

జనగామ కల్చరల్, మే 1: కార్మిక ద్రోహి బీజేపీ ఓటమే లక్ష్యంగా కార్మికులు మేడే సందర్భంగా ప్రతినబూనాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాలో బుధవారం మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. వాడ వాడలా ఎర్రజెండాలు రెపరెపలాడాయి. జనగామ వ్యవసాయ మార్కెట్‌లో గల జెండా గద్దెల పై ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా నాయకులు గుండెల్లి రాజు, బుడిగ వీరస్వామి ఎర్ర జెండాలు ఆవిష్కరించారు. షాప్స్ అండ్ గ్రెయిన్ మార్కెట్ హమాలీ యూనియన్ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి చామకూర యాకూబ్ జెండావిష్కరణ చేయగా ఏఐటీయూసీ జెండా గద్దెపై జిల్లా అధ్యక్షుడు కేమిడి మల్లయ్య జెండాను ఆవిష్కరించారు. సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంపై జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్.రాజారెడ్డి మేడే జెండాను ఆవిష్కరించారు. భవన నిర్మాణ కార్మికుల లేబర్ అడ్డాపై ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, సీపీఐ పట్టణ కార్యాలయంపై జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ 8 గంటల పనితో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను సాధించడంలో ఎందరో కార్మికులు బలిదానం చేశారన్నారు. కార్మికులంతా ఏకమై లోకసభ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. రైతుల మరణానికి కారణమైన మోదీ ప్రభుత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించకూడదన్నారు. రైతులంతా ఏకమై ఇండియా కూటమికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో గొలనుకొండ నాగరాజు, శంకర్, కొలిపాక శ్రీనివాస్, తిప్పరబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.

జనగామ మండలం వడ్లకొండలో సీపీఐ మండల కార్యదర్శి చల్లోజు మల్లేశం మేడే జెండాను ఆవిష్కరించారు. గ్రామ కార్యదర్శి వెంకటయ్య,

మిగతా 8వ పేజీలో...



జనగామ హమాలీ యూనియన్ అడ్డా వద్ద మాట్లాడుతున్న రాజారెడ్డి



జనగామ సీపీఐ కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న మోకు కనకారెడ్డి

ఘనంగా శ్రవణ నక్షత్ర హోమం

పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు

చిలుపూర్, మే 1: శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని చిలుపూర్ గుట్ట బుగులు వెంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం ఘనంగా హోమపూజ నిర్వహించారు. ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, పూజారి సౌమిత్రి రంగాచార్యులు చేపట్టిన హోమపూజకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు ఉత్సవ మూర్తులకు పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. అనంతరం భక్తులకు స్వామివారి శేష వస్త్రాలతో పాటు, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో లక్ష్మీప్రసన్న, ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్ రావు, మాజీ చైర్మన్ మామిడాల యాదవరెడ్డి, కృష్ణమాచార్యులు, మాజీ ధర్మకర్త సంగోజు మోహనాచారి - శంకర లక్ష్మి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



శ్రవణ నక్షత్రం సందర్భంగా వెంకన్న ఆలయంలో హోమపూజ చేస్తున్న పూజారులు

నా చావుకు సీఐ, ఎస్ఐ కారణం

- సూసైడ్ నోట్ రాసి అదృశ్యమైన వ్యక్తి
- నా భర్తను కాపాడండి : బాధితుడి భార్య



వరంగల్ క్రైం, మే1: తన చావుకు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ సీఐ జె.సురేష్, ఎస్ఐ ఎం.సురేష్‌తోపాటు మరో ఐదుగురు కానిస్టేబుళ్లు కారణమని ఆరోపిస్తూ వంగపహాడ్ గ్రామానికి చెందిన ప్రశాంత్ అనే వ్యక్తి సూసైడ్ నోట్ రాసి అదృశ్యమవడం కలకలం రేపింది. గ్రామంలో తనకు వీరేశం అనే వ్యక్తి డబ్బులు ఇవ్వాల్సి ఉండగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళితే పోలీసులు విచక్షణారహితంగా కొట్టారని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. పోలీసుల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నాని పేర్కొంటూ ప్రశాంత్ మంగళవారం అదృశ్యమయ్యాడు. అయితే తన భర్తను కాపాడి పోలీసులపై చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ బాధితుడి భార్య మాధవి పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. సహాయం కోసం వెళితే హసన్‌పర్తి సీఐ, ఎస్ఐలు కొట్టడం వల్లనే అవమానం భరించలేక తన భర్త సూసైడ్ నోట్ రాసి ఎటో వెళ్లిపోయాడని ఆమె విలపించారు. తన భర్తకు ఏదైనా జరిగితే దానికి సీఐ, ఎస్ఐ బాధ్యత వహించాలని ఆమె తెలిపారు. కాగా, డయల్ 100ను దుర్వినియోగం చేశాడని సోమవారం హసన్‌పర్తి పోలీసులు ప్రశాంత్‌ను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసిన విషయం తెలిసిందే. అదేరోజు సాయంత్రం నుంచి ప్రశాంత్ అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సమాజ సమస్యలపై వ్యాసరచనలు చేపట్టాలి

సుబేదారి, మే 1: సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై వ్యాసరచనలు చేపట్టాలని కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ అన్నారు. సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జర్నలిజం విభాగం అధ్యాపకుడు డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి వ్యవసాయ, విద్య, వైద్య సామాజిక రంగాలపై రాసిన వివిధ పత్రికల్లో ప్రచురితమైన వ్యాసాల సంపుటి పుస్తకాన్ని రూపొందించారు. ఈ పుస్తకాన్ని బుధవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రమేష్ మాట్లాడుతూ.. సామాజిక శాస్త్రాల అధ్యాపకులకు సమాజంపై పూర్తి అవగాహన ఉండాలని అన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, సీనియర్ అధ్యాపకులు అంజనారావు, డాక్టర్లు కరుణాకర్, శ్రీధర్‌కుమార్, శేషు, శ్రీలత, మాధవి, రాంబాబు, సుచరిత, నాగయ్య, భిక్షపతితోపాటు రచయిత ఆదిరెడ్డి పాల్గొన్నారు.

10 జీపీఏ సాధించిన వారికి మోషన్ కళాశాలలో ఉచిత విద్య

వరంగల్ ఎడ్యుకేషన్, మే 1: పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు హనుమకొండ నయీంనగర్‌లోని రాజస్థాన్ కోట మోషన్ జూనియర్ కళాశాలలో రెండేళ్ల ఫ్రీ ఎడ్యుకేషన్ అందిస్తున్నట్లు కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ పేర్కొన్నారు. ఐఐటీ, నీట్‌లకు విద్యను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. అలాగే 9.8 జీపీఏ సాధించిన విద్యార్థులకు ఐఐటీ, నీట్‌తో పాటు కళాశాల ఫీజులో 50 శాతం రాయితీని ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఐఐటీ, మెడికల్‌లో సీట్లు సాధించడమే లక్ష్యంగా నెలకొల్పిన రాజస్థాన్ కోట మోషన్ జూనియర్ కళాశాల యాజమాన్యం ప్రతిభ కలిగిన ఉత్తమ విద్యార్థులను గుర్తించి ఉచితంగా విద్యను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. మిగతా అన్ని వివరాలకు నయీంనగర్‌లోని మోషన్ జూనియర్ కళాశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

మహిళ ఖాతా నుంచి డబ్బులు మాయం

హనుమకొండ టౌన్, మే1: మహిళ బ్యాంక్ ఖాతా నుంచి ఆమెకు తెలియకుండానే వేరే ఖాతాలోకి డబ్బులు బదిలీ అయ్యాయి. హనుమకొండ కిషన్‌పురలో నివాసం ఉంటున్న రజిని అనే మహిళ ఏప్రిల్ 26న ఉదయం బ్యాలెన్స్ చెక్ చేసుకోగా రూ.30,000 డ్రా చేసినట్లుగా చూపించింది. వెంటనే సంబంధిత బ్యాంకు మేనేజర్‌ను ఫోన్‌లో సంప్రదించగా సత్యం ఎంటర్‌ప్రైజెస్‌కు ట్రాన్స్‌ఫర్ అయినట్లుగా సమాచారం ఇచ్చాడు. కాగా, బాధితురాలు బుధవారం హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు పేర్కొనారు.

కాజీపేటలో పోలీసుల తనిఖీలో రూ.3.41 లక్షలు పట్టివేత

కాజీపేట, మే 1: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసుల వాహనాలు తనిఖీ చేస్తుండగా తనిఖీలలో ఇద్దరు వ్యక్తులు సరైనపత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట డీజిల్‌కాలనీ చెక్‌పోస్ట్ వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ధర్మారం గ్రామానికి చెందిన లక్కాకుల సురేశ్ సరియైన పత్రాలు లేకుండా బైక్‌లో రూ.2,71,060 తరలిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఇదే చెక్‌పోస్ట్ వద్ద వరంగల్‌కు చెందిన మిట్టపల్లి రాకేశ్, సరైన పత్రాలు లేకుండా తన బైక్‌లో రూ.70వేల 800 తరలిస్తుండగా పట్టుపడ్డారు. నగదు స్వాధీనం చేసుకుని అధికారులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అరూరికి ఓటమి భయం

అందుకే చిల్లర మాటలు మాట్లాడుతున్నాడు ● ఎర్రబెల్లి, అరూరిని మడతబెట్టిన నియోజకవర్గాల ప్రజలు : ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వర్ధన్నపేట రూరల్, మే 1 : వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌కు ఓటమి భయం పట్టుకుందని, అందుకే చిల్లర మాటలు మాట్లాడుతున్నాడని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యాఖ్యానించారు. బుధవారం వర్ధన్నపేట పట్టణంలోని ఏబీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి కమిటీల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బూత్ కమిటీలే పార్టీకి పునాదులని, రానున్న రోజుల్లో కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. బీజేపీతో పదేండ్లుగా ప్రజలకు ఎలాంటి న్యాయం జరగలేదని, అన్ని రంగాల్లో విధ్వంసం జరిగిందని ఆరోపించారు. కడియం కావ్య నియోజకవర్గ పరిధిలోని పర్వతగిరి గ్రామంలోనే పుట్టి పెరిగిందని, చదువుకుని మళ్లీ వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలోనే వైద్యురాలిగా పనిచేసిందని గుర్తుచేశారు. ఈ ప్రాంత ప్రజల కష్టసుఖాలు తెలిసిన కావ్యను గెలిపించి ఆశీర్వదించాలని కోరారు.

పార్లమెంటు అభివృద్ధిని మరిచి వ్యక్తిగత విమర్శలు చేస్తున్న అరూరికి ప్రజలే గుణపాఠం చెబుతారని తెలిపారు. వంద శాతం కడియం కావ్య లోకలేనని స్పష్టం చేశారు. రైతుల భూములు లాక్కొని రియల్ ఎస్టేట్ వాళ్లతో కలిసి ఫెన్సింగ్‌లు వేసిన ఘనత రమేష్‌దని గుర్తు చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే అరూరి రమేష్ మండలానికో గెస్ట్ హౌస్ నిర్మించుకున్నాడని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తిలో ఎర్రబెల్లి దయాకర్‌రావును, వర్ధన్నపేటలో అరూరి రమేష్‌ను ప్రజలు మడతపెట్టి కొడితే దిమ్మ తిరిగి పోయిందని ఎద్దేవా చేశారు. మనుమరాలు వయసున్న అమ్మాయి చేతిలో ఓడిపోయిన ఎర్రబెల్లి ఇంకా సిగ్గులేకుండా నియోజకవర్గంలో తిరుగుతూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అద్భుతమైన మేనిఫెస్టోను తీసుకువచ్చిందని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేద మహిళలకు రూ.లక్ష అందించడం ఖాయమన్నారు. కిసాన్ న్యాయ్ పేరుతో రైతులను ఆదుకుంటామని, పంటలకు కనీస మద్దతు ధర చట్టం తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

అరూరి అకృత్యాలు అన్నీ ఇన్నీ కావు : కడియం కావ్య

వర్ధన్నపేట ఎమ్మెల్యేగా ఉండి అరూరి రమేష్ చేసిన అకృత్యాలు అన్నీ ఇన్నీ కావని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య విమర్శించారు. అరూరి రమేష్ చేసిన అవినీతి, అక్రమాలు, అకృత్యాలు, భూకబ్జాలు ప్రజలందరికీ తెలుసని, మళ్లీ ఓట్ల కోసం వస్తున్న రమేష్‌కు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. బీజేపీ రైతుల సంక్షేమాన్ని మరిచి కార్పొరేట్ సంస్థల కోసం పనిచేస్తోందని ఆరోపించారు. బీజేపీకి ధన బలముంటే, కాంగ్రెస్ పార్టీకి ప్రజాబలం ఉందన్నారు. తన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే అరూరి రమేష్ బీజేపీ పంచన చేరాడని తెలిపారు. వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో వసతులు లేక ఇబ్బందులు పడుతున్నా, ఏనాడూ ఎమ్మెల్యేగా ఉండి పట్టించుకోలేదని ఆరోపించారు. కరోనా క్లిష్టకాలంలో సైతం ఇక్కడి ప్రజలకు తాను సేవ చేశానని, మీరు ఆశీర్వదిస్తే వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందని స్పష్టం చేశారు.

అనంతరం వర్ధన్నపేట పట్టణానికి చెందిన వంద మంది బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ నేత కత్తి వెంకటస్వామి, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మునిసిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, మాజీ జడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న అభ్యర్థి కడియం కావ్య, పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

కావ్యకు పలువురి మద్దతు

హనుమకొండ సిటీ/వడ్డేపల్లి: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్యకు తెలంగాణ మైనారిటీ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అఖిల్ పాషా మద్దతు తెలియచేశారు. బుధవారం హనుమకొండలోని కడియం కావ్య నివాసంలో సమాఖ్య ప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ మజహార్ హుస్సేన్, మహ్మద్ అబిద్ నవాజ్, నూర్జహాన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

అలాగే కడియం కావ్యకు సంపూర్ణ మద్దతును తెలుపుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ పేర్కొన్నారు. బుధవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు రాష్ట్ర కన్వీనర్ నల్లాల కనకరాజు, వైస్ చైర్మన్లు అనిల్, నాను మాట్లాడారు. ఈ సమావేశంలో జంగం బాబురావు, రాజకొమురయ్య, ఐలయ్య, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఇండోర్ స్టేడియంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న లోక్ సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య, కడియం శ్రీహరి

జేఎన్ఎస్‌లో కావ్య ఎన్నికల ప్రచారం

హనుమకొండ చౌరస్తా, మే 1: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్, ఔట్ డోర్ స్టేడియంలో మార్నింగ్ వాకర్స్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బుధవారం స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలసి హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మార్నింగ్ వాకింగ్ పాల్గొని వాకర్స్‌ను కలసి ముచ్చటిస్తూ చెయ్యి గుర్తుకు ఓటు వేసి తనని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు.

ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అంటేనే అభివృద్ధి, సంక్షేమానికి మారు పేరు అని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో ప్రజాపాలన అందుబాటులోకి వచ్చిందని కొనియాడారు. కేంద్రంలో రాహుల్ గాంధీ సారథ్యంలో దేశ ప్రజలకు మంచి పాలన అందనుందని తెలిపారు. నిత్యం ప్రజల మధ్యలో అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. చెయ్యి గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని వాకర్స్‌ను కోరారు. ప్రచారంలో భాగంగా సరదాగా క్రీడాకారులతో కలిసి ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ ఆడి ఆకట్టుకున్నారు. అంతకుముందు బాలసముద్రంలోని కూరగాయల మార్కెట్‌లో ఎన్నికల ప్రచారంలో కావ్య పాల్గొని కాంగ్రెస్ పార్టీ చెయ్యి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ మేరకు మార్కెట్‌లో ఉన్న వ్యాపారులు కావ్యకు మద్దతూ ప్రకటిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కిరిబిక్కిరి

ఎండల తీవ్రత, ఉక్కపోతతో జనం విలవిల

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 45.6డిగ్రీల సగటు ఉష్ణోగ్రత

హనుమకొండ (ఆంధ్రజ్యోతి) / ములుగు/ భూపాలపల్లి టౌన్/ జనగామ కల్చరల్ / మహబూబాబాద్ రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) :ఎండల తీవ్రత మరింత పెరిగింది. ఎండతీవ్రతకు తోడు వడగాలులు, ఉక్కపోతకు జనం విలవిలలాడుతున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యధిక పగటి ఉష్ణోగ్రత 45.6 డిగ్రీల సగటు ఉష్ణోగ్రత నమోదైంది. బుధవారం ములుగు జిల్లాలో అత్యధికంగా 45.6 డిగ్రీల రికార్డు స్థాయి ఉష్ణోగ్రత నమోదవగా వరంగల్‌లో 45.4 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 45.3 డిగ్రీలు, జనగామలో 45.3 డిగ్రీలు, మహబూబాబాద్‌లో 45.1 డిగ్రీలు, హనుమకొండలో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 15 జిల్లాల్లో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవగా వీటిలో అయిదు జిల్లాలు ఉమ్మడి వరంగల్ పరిధిలోనే ఉన్నాయి. ఉష్ణోగ్రతలు అంతకంతకు పెరుగుతుండడంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేయగా.. ఈ అయిదు జిల్లాలు ఆ జాబితాలో ఉన్నాయి. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో 45డిగ్రీలు దాటి ఎండల తీవ్రత ఉండడం వందేళ్లలో ఇదే మొదటి సారి అని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. 1921లో ఈ స్థాయిలో ఎండలు రికార్డు అయ్యాయని, ఆ తర్వాత ఏప్రిల్ నెలలో 45 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదవలేదని, సాధారణంగా ఏప్రిల్‌లో 40 నుంచి 41డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదు అవుతుంటాయని, ఈ సారి మాత్రం ఇందుకు భిన్నంగా ఏప్రిల్ మొదటి వారం నుంచె ఎండలు 41 డిగ్రీలు దాటాయని చెబుతున్నారు.

ఉడికిపోతున్న ఏజెన్సీ మండలాలు

వేసవి తీవ్రతతో ములుగు జిల్లాలోని ఏజెన్సీ మండలాలు ఉడికిపోతున్నాయి. కొద్దిరోజులుగా 45డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా బుధవారం ఏకంగా 46డిగ్రీలు దాటింది. మంగపేట మండలం మల్లూరులో 46.5, వెంకటాపురం(నూగూరు) మండలం అలుబాకలో 46డిగ్రీల రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. అలాగే తాడ్వాయి మండలం మేడారంలో 44.4, వాజేడు మండలం ధర్మవరంలో 44.3, వెంకటాపూర్(రామప్ప)లో 44.2, ములుగు మండలం ఖాసిందేవిపేటలో 44, ఏటూరునాగారంలో 43.8, గోవిందరావుపేటలో 43.5, కన్నాయిగూడెంలో 42.3డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. అలాగే జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆరంజ్ జోన్ నుంచి రెడ్ జోన్‌లోకి వచ్చింది. నిన్న మొన్నటి వరకు 43 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న మండలాల్లో బుధవారం 45 డిగ్రీలు దాటింది. చిట్యాల మండల కేంద్రంలో 45.5డిగ్రీలు, మల్హర్ మండలంలోని తాడిచర్లలో 45.3, రేగొండ మండలంలోని గోరికొత్తపల్లిలో 45.3, అలాగే గణపురంలోని చెల్పూరులో 45.1 డిగ్రీలు, మొగుళ్లపల్లిలో 44.8 డిగ్రీలు నమోదవగా మిగిలిన మండలాల్లోనూ 45 నుంచి 42డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో వైపు జనగామ కూడా రెడ్‌జోన్‌లోకి వెళ్లింది. బుధవారం గరిష్ఠంగా 45.6డిగ్రీల సగటు ఉష్ణోగ్రత నమోదైంది. చిలుపూర్, జఫర్‌గడ్ మండలాల్లో 45.6, జనగామలో 45.0 డిగ్రీలు నమోదైంది.



మండే ఎండ.. పచ్చి గడ్డే అండ

ఎండలు మండుతున్నాయి... రోజురోజుకు ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి. బయటకు రావాలంటేనే జనం బెంబేలెత్తుతున్నారు. ఇక ఇళ్లలో ఉండే వారు ఉక్కపోతకు అల్లాడుతున్నారు. ముఖ్యంగా రేకుల ఇళ్లలో నివాసం ఉండే వారి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఈ క్రమంలో హనుమకొండ న్యూశాయంపేట వద్ద రేకుల షెడ్డులో నివాసం ఉంటున్న ఓ కుటుంబం భానుడి ప్రతాపం నుంచి కొంత ఉపశమనం పొందేందుకు ఇలా వారు నివాసం ఉంటున్న రేకుల కప్పుపై పచ్చని జమ్మి గడ్డిని వేసుకున్నారు.

ఫోటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

వడదెబ్బతో ముగ్గురి మృతి

వడదెబ్బ బారిన పడి ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ మండలం ముడుపుగల్‌లో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన మేరుగు నారాయణ (75) ఎండతీవ్రత, వడగాలుకు అనారోగ్యం పాలై.. బుధవారం వ్యరిస్థితి విషమించి ఇంటివద్దే మృతిచెందాడు. జనగామ జిల్లా కేంద్రంలోని గుండ్లగడ్డకు చెందిన మహ్మద్ మొయినొద్దీన్ (52) అనే కూలీ రోజూలాగే బుధవారం కూడా పనికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి కుప్పకూలిపోయాడు. జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. అలాగే కమలాపూర్ మండలంలోని గూడూరు గ్రామానికి చెం దిన పత్తిపాక రమేష్(48) అనే చిరువ్యాపారి రోజూలాగే దుస్తులు అమ్మి మంగళవారం అస్వస్థతకు గురవగా ఆసుపత్రికి తరలించారు. కానీ ఆయన అప్పటికే మృతిచెందాడు.

లోక్‌సభ ఎన్నికల్లో ఆశీర్వదించండి..

- దళితులను ముట్టుకోని వ్యక్తి కడియం కావ్య
- పదవులు అనుభవించి కేసీఆర్‌కు కడియం వెన్నుపోటు
- వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్
- ఏనుగల్లు, పర్వతగిరిలో కార్నర్ మీటింగ్‌లు

పర్వతగిరి, మే 1: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని ఏనుగల్లు, పర్వతగిరిలో బీజేపీ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్‌లను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన ర్యాలీలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. జై బీజేపీ.. జై అరూరి.. నినాదాలతో గ్రామాలు మార్మోగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలు తనను రెండు సార్లు ఎమ్మెల్యేగా ఆశీర్వదించారని, ప్రస్తుతం మీ ఇంటి బిడ్డగా పార్లమెంట్ సభ్యుడిగా ఆశీర్వదించాలని కోరారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితుడినై తాను బీజేపీలో చేరారని, తనతో పాటు అనేక మంది మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఓడించడానికి ఎన్ని కుట్రలు చేశారో ప్రజలకు తెలుసని, ప్రస్తుతం ఆ కుట్రలను పటాపంచలు చేయాలన్నారు. తనను ఓడించడం కోసం కడియం శ్రీహరి అనేక ప్రయత్నాలు చేశాడని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ప్రజలకు కన్నీళ్లు మిగిల్చాయన్నారు. హామీలు అమలు చేసే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని, కాంగ్రెస్ పార్టీ నేతలు వచ్చి కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లడుగుతారని, వారి మాటలను నమ్మి మోసపోవద్దని హితవు పలికారు.

కడియం శ్రీహరి కుమార్తె కావ్యకు రేవంత్‌రెడ్డి ఎందుకు టికెట్ ఇచ్చాడో కాంగ్రెస్ నేతలు ఆలోచన చేయాలని అరూరి రమేష్ కోరారు. కాంగ్రెస్‌లో కష్టపడ్డ దళితులు లేరా అని ప్రశ్నించారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని, కాంగ్రెస్ పార్టీ నేతల మీద లేని స్కాంలు లేవన్నారు. వర్ధన్నపేట ఆస్పత్రిలో కడియం కావ్య డాక్టర్‌గా పని చేసిందని, ఆస్పత్రిలో వైద్యం కోసం వచ్చిన దళితులను కనీసం ముట్టుకుని వైద్యం చేయలేదని విమర్శించారు. ఊసరవెల్లిలాగా రంగులు మార్చే వ్యక్తి కడియం శ్రీహరి అని, పదవులు అనుభవించి కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. తాటికొండ రాజయ్య, పసునూరి దయాకర్‌తో పాటు తనను సైతం బీఆర్ఎస్ పార్టీ నుంచి వెళ్లగొట్టింది కడియం శ్రీహరి అని ఆరోపించారు. పదేళ్లు వర్ధన్నపేటకు ఎమ్మెల్యేగా ఉండి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశానని, అవి మీ కళ్ల ముందే ఉన్నాయని తెలిపారు. మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి చెందుతోందని, అభివృద్ధి చేసే బీజేపీకే ఓటు వేసి మళ్లీ పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. మే 13వ తేదీన అందరూ కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, కొండేటి శ్రీధర్, వరంగల్ తూర్పు బీజేపీ ఇన్‌చార్జ్ ఎర్ర బెల్లి ప్రదీప్‌రావు, జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కుడికాల శ్రీధర్, జిల్లా నాయకులు గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, బన్న ప్రభాకర్, మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, నాయకులు ఏకాంతం గౌడ్, నరేందర్ వర్మ, రంగు కుమార్ గౌడ్, రంగు రజిత, లక్ష్మీనారాయణ, బొట్ల మధు తదితరులు పాల్గొన్నారు.



పర్వతగిరిలో దివ్యాంగురాలితో మాట్లాడుతున్న అరూరి రమేష్



ఏనుగల్లులో ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

స్టేషన్‌ఘన్‌పూర్, మే 1 : మాదిగలకు ద్రోహం చేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని, బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌కు మాదిగలు, మాదిగ ఉపకులాలు ఓటు వేసి గెలిపించాలని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మాదిగల అండతో రాజకీయంగా ఎదిగిన కడియం శ్రీహరి.. మాదిగలను రాజకీయంగా అణగదొక్కుతూ వారి రాజకీయ భవిష్యత్తును సమాధి చేస్తున్నాడని అన్నారు. కడియంకు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే మాదిగలకు, మాదిగ ఉపకులాలకు మేలు జరుగుతుందన్నారు. బీజేపీ గెలిస్తే మాదిగల అనేక ఏళ్ల సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు పుట్ట రవి, నియోజకవర్గ ఇన్‌చార్జి చాడ ఏలియా, నాయకులు గాదె శ్రీధర్, రడపాక అదాం, గాదెపాక మహేందర్, గంగాదర్, రవీందర్, గాదె కుమార్, మేడ యాకస్వామి, అశోక్, రాజశేఖర్ పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంద కుమార్

కావ్య గెలుపు కోసం నేతల ప్రచారం



జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి(జి)లో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నం బ్రహ్మరెడ్డి

జఫర్‌గడ్, మే 1: వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోసం బుధవారం జఫర్‌గడ్‌తో పాటు తమ్మడపల్లి(జి), సూరారం, తీగారం తిమ్మాపూర్, ఉప్పుగల్లు, తదితర గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు, డోర్ పోస్టర్లను పంపిణీ చేసి అభివృద్ధి కోసం కావ్యను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు అన్నం బ్రహ్మరెడ్డి, అన్నెబోయిన భిక్షపతి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే రైతుల 2 లక్షల రుణమాఫీని ఒకేసారి అమలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారన్నారు. బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజల బతుకులు మరింత దుర్భరంగా మారతాయన్నారు. సంక్షేమ పాలన అందించే కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్‌లు కుల్ల మోహన్‌రావు, అన్నెపు అశోక్, జ్యోతి యాకయ్య, ఇల్లందుల మొగిలి, టి.ఎల్లయ్య, కన్న సోమశేఖర్, నంచర్ల యాదగిరి, సత్యనారాయణ, సింగపురం అశోక్, కలకోట అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్ల: కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కావ్య గెలుపు కోసం నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సోమనర్సయ్య, భిక్షపతి, మసురం రవీందర్, మహిళా నాయకులు శ్రీవర్ణ, వలభోజు రమేశ్, బత్తుల వెంకన్న, పసునూరి మధుసూదన్, రాజు, గ్రామ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో కాంగ్రెస్ నాయకులతో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కడియం కావ్యను అత్యధిక మేజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, జడ్పీటీసీ బొల్లం అజయ్‌మణికంఠ, మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, నాయకులు మారజోడు రాంబాబు, నామాల బుచ్చయ్య, నీలం యువరాజ్, కొలిపాక మల్లేష్, రాపోలు రాంమ్మూర్తి, పేర్ని ఉషరవి, గాదె మహేందర్ రెడ్డి, ఇబ్రహీం పాష, రాయపు రెడ్డి, రంగు రాజు పాల్గొన్నారు.

చిలుపూర్: మండలంలోని పల్లగుట్ట, లింగంపల్లి, శ్రీపతిపల్లి, చిన్నపెండ్యాల తదితర గ్రామాల్లో పార్టీ జిల్లా నాయకుడు, చిలుపూర్ ఆలయ అభివృద్ధి శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు నేతృత్వంలో కావ్యకు మద్ధతుగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. కావ్యను గెలిపిస్తే ఉమ్మడి వరంగల్ జిల్లా ఎంతో అభివృద్ధి చెందనుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు గౌడ్, సీపీఐ మండల కార్యదర్శి పైస రాములు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చిలుపూర్‌తో పాటు కొత్తపల్లి, వడ్డెరగూడెం తదితర కాలనీల్లో ఎంపీపీ బొమ్మిశెట్టి సరిత -బాలరాజు ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో మండలాధ్యక్షుడు గడ్డమీది సురేశ్, మైనారిటీ సెల్ జిల్లా నాయకుడు ఎమ్డీ షకీల్, మాజీ సర్పంచులు మామిడాల లింగారెడ్డి, తాళ్ళపల్లి సమ్మయ్య, ఏదునూరి రవిందర్, కొయ్యడ రాందాస్, ఎంపీటీసీ ఎన్నకూస కుమార్, గడ్డమీది వెంకటస్వామి, తౌటి సునిల్, రత్నాకర్‌రెడ్డి, రంగు రమేష్, గొంగిడి కృష్ణమూర్తి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కడియం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎంపీటీసీ

లింగాలఘణపురం: కళ్లెం ఎంపీటీసీ మార్పు కృష్ణవేణిశ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆధ్వర్యంలో బుధవారం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ ఎమ్మెల్యే కడియం చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. ఎంపీటీసీతో పాటుగా మరో 30 కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు.

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామ రేణుక ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మందపురం ఎల్లాగౌడ్‌తో పాటు పలువురు నాయకులు బుధవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమక్షంలో హన్మకొండలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిలో పోగాకు సోమయ్య, దయాకర్‌తో పాటు మరికొంత మంది నాయకులు ఉన్నారు. కార్యక్రమంలో ఇప్పగూడెం ఎంపీటీసీ నెలమంచ శైలజా-అజయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్‌లో కార్మిక పతాకం ఎగుర వేస్తున్న సీపీఎం నాయకులు



పాలకుర్తిలో ఎర్రజెండాను ఆవిష్కరిస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు



జఫర్‌గడ్‌లో జెండాను ఎగురవేస్తున్న సీపీఎం నాయకులు

ఘనంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవం

- మే డే జెండాలు ఆవిష్కరించిన సంఘాలు
- సమస్యలపై నినదించిన కార్మికులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మే 1: ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా మేడే వేడుకలు బుధవారం పలు చోట్ల కార్మికులు ఉత్సాహంగా, ఘనంగా నిర్వహించారు. కార్మిక సంఘాల పతాకాలను ఎగురవేశారు. హక్కులు, సమస్యలపై నినాదాలు చేశారు. డివిజన్ కేంద్రం స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో వేడుకలు, నినాదాలతో కార్మికులు హోరెత్తించారు. సీపీఎం, సీఐటీయూ, సీపీఐ, కూలీలు, హమాలీలు, ఆటో, డీసీఎం, జీపు డ్రైవర్లు, గ్రామ పంచాయతీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు తదితర సంఘాల నేతృత్వంలో మేడే ఉత్సవాలు జరిగాయి. స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్ వద్ద మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మునిగెల రమేశ్ కార్మిక పతాకాన్ని ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నదని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మి కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందని ఆరోపించారు. కార్యక్రమాల్లో సీపీఎం, సీపీఐ అనుబంధ సంఘాల జిల్లా నాయకులు పి.పరమేశ్, వి.సోమయ్య, టి.ఐలయ్య, ఎం.సమ్మయ్య, చింత జగదీష్, రహ్మతుల్లా, సముద్రాల రాజు, బాబు, ఎస్.రవి, కె.రాజు, కె.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి: పాలకుర్తి, కోతులబాద్, తిరుమలగిరి, దర్దెపల్లి, మంచుప్పుల, వల్మిడి గూడూరు, బమ్మెర, ఈరవెన్ను గ్రామాల్లో ఎర్రజెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు చిట్యాల సోమన్న, మాచెర్ల సారయ్య మాట్లాడుతూ చికాగో నగరంలో 8 గంటల పని దినాలను కోరుతూ లక్షలాది మంది కార్మికులు రోడ్డెక్కి భారీ ప్రదర్శన చేస్తుంటే అమెరికా ప్రభుత్వం కార్మికులపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపి వేల మంది కార్మికుల రక్తంతో తడిసిందే ఎర్రజెండా అని అన్నారు. కార్మికుల పక్షాన పోరాడేది సీపీఎం, సీఐటీయు పార్టీలని అన్నారు. కార్యక్రమంలో ఏదునూరి మదార్, ఇంద్రారెడ్డి, తోట రాజు, కుమార్, కుక్కల సోమయ్య, పరంజ్యోతి, మహేష్, చిక్కుడు మల్లయ్య, జలగం అంజయ్య, రవి తదితరులు ఉన్నారు.

జనగామ కల్చరల్: ప్రపంచ కార్మికదినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయం వద్ద రాష్ట్ర కార్యదర్శి కె.రంజిత్‌కుమార్ పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు, బాద్యులు ఆగయ్య, జి.కృష్ణ, జి.కనకయ్య, నరసింహులు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్ల: మండలకేంద్రంలో తాపీ మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో మేడే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈదురు వెంకన్న, ఎండి రఫిక్, అంజయ్య, ఆనంద్, ఎల్లయ్య, పుల్లయ్య, యాకయ్య, అయిలయ్య, సోమన్న, దేవయ్య, సరేష్ , హమాలీలు, ఆటో డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

తరిగొప్పుల: అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని గ్రామాల్లో ఎర్ర జెండాలు ఆవిష్కరించారు. మండలకేంద్రంలో సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి పాండ్యాల అంజయ్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం హమాలి వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి అంఘటిత కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్‌లు, ఏఐటీయూ, సీఐటూయూ నేతలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల: అప్పిరెడ్డిపల్లెలో పద్మశ్రీ పురస్కార గ్రహీత గడ్డం సమ్మయ్య కార్మిక జెండాను ఆవిష్కరించారు. కడవెండిలో రైతు సంఘం జిల్లా నాయకులు బిల్లా తిరుపతిరెడ్డి, అదే విధంగా రాంరాజుపల్లి, నీర్మాల, సింగరాజుపల్లి, బంజార, పెద్దమడూరు, చిన్నమడూరు, చింతబాయితండ, కడవెండి, సీతారాంపురం, కామారెడ్డిగూడెం, సీతారాంపురం, దేవరుప్పుల, మన్‌పహాడ్, ధర్మాపురం గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సింగారపు రమేష్ ముఖ్య అతిథిగా హాజరై కార్మిక జెండాలను ఆవిష్కరించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో సీపీఐ మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు గోపాల శ్రీనివాస్, ప్రతినిధులు జీడి నరసింహా, బాషిపాక సోమయ్య, భాస్కర్, మహేష్, ఎండీ. యాఖూబ్‌పాషా, ఆవుల వీరన్న తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురష్కరించుకుని బచ్చన్నపేటతో పాటు గ్రామాలలో సీపీఎం, సీఐటీయూ, భవన నిర్మాణరంగ కార్మిక సంఘం, ఏఐటీయూసీ, హమాలీ కార్మికులు కార్మిక జెండాలను ఎగురవేశారు. కార్యక్రమాల్లో సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్, వివిధ పార్టీల నేతలు, కార్మిక సంఘాల నాయకులు అన్నెబోయిన రాజు, రవీందర్‌రెడ్డి, నర్సింహులు, ఎల్లయ్య, బలరాములు, రామగళ్ల అశోక్, శ్రీనివాస్, వెంకటమ్మ, రాములు, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే కొన్నె గ్రామంలో సామాజిక సేవకులు కోడూరు శివకుమార్‌గౌడ్ పారిశుధ్య కార్మికులను శాలువాలతో సన్మానించారు.

జఫర్‌గడ్: మే డేను పురస్కరించుకుని జఫర్‌గడ్‌తో పాటు తిమ్మాపూర్, తమ్మడపల్లి(జి), హిమ్మత్‌నగర్, తీగారం, సాగరం, తిమ్మంపేట, ఓబులాపూర్, సూరారం, కూనూరు, ఉప్పుగల్లు, షాపల్లి, తదితర గ్రామాల్లో ప్రధాన కూడళ్లు, రైస్ మిల్లుల వద్ద ఎర్ర జెండాలను ఎగురవేశారు. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి, మేడే వర్ధిల్లాలి వంటి నినాదాలతో కార్మికులు హోరెత్తించారు. పాలకుల కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా నాయకులు రాపర్తి సోమయ్య, సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేశ్, సీఐటీయు, ఎఐటీయుసీ, ఆటో, హమాలీ, తదితర కార్మిక సంఘాల నేతలు కాట సుధాకర్, యాకూబ్‌పాషా, పెండ్యాల సమ్మయ్య, మంద బుచ్చయ్య, కూరపాటి చంద్రమౌళి, మండల గట్టుమల్లు, ముసలయ్య, అజయ్, జాఫర్, నల్లతీగల శ్రీనివాస్, వడ్లకొండ సుధాకర్, ఎక్బాల్, యాతం సమ్మయ్య, శంషోద్దిన్, రేణుక, లక్ష్మీ, అనంతలక్ష్మీ పాల్గొన్నారు.

రఘునాథపల్లి: సీపీఎం, సీపీఐ, భవన నిర్మాణరంగ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మిక జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పొదల నాగరాజు, గంగాపురం మహేందర్, సీపీఐ నాయకులు కావటి యాదగిరి, జనార్ధన్, భవన నిర్మాణరంగ కార్మిక సంఘం నాయకులు రాసమల్ల కొంరయ్య, కృష్ణ, అంజయ్య పాల్గొన్నారు.

నర్మెట: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని మండలంలోని అన్ని గ్రామాలలోని కార్మికులు ఘనంగా నిర్వహించారు. సీపీఐ, భవన నిర్మాణ, హమాలి సంఘాల ఆధ్వర్యంలో అన్ని గ్రామాలలో ఎర్రజెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భవననిర్మాణ కార్మికులు, హమాలి కార్మికులు పాల్గొన్నారు.

చిలుపూర్: మేడేను పురస్కరించుకుని లింగంపల్లి, చిలుపూర్ గ్రామాల్లో కార్మిక జెండాలను ఆవిష్కరించారు. అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అపరాధపు రాజు, సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు పైస రాములు, సాదం రమేష్, నాయకులు బోనగిరి కుమారస్వామి, తుత్తూరు మల్లేష్, ఆవుల రవి, తౌటి రమేష్, గొడుగు రాజు, శ్రీరాములు శ్రీనివాస్, మారపాక వెంకటస్వామి, బండారి రాజ్‌కుమార్, రాజు, మతిన్, గద్ద నాగరాజు, ఊరడి సాంబరాజు, గణేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

లింగాలఘణపురం: మండల వ్యాప్తంగా కార్మికుల దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. లింగాలఘణపురంలో ఏఐటీయూసీ, వ్యవసాయ కార్మిక సంఘం, భవననిర్మాణ కార్మిక సంఘం, సీపీఐ మండల కార్యదర్శి రావుల సదానందం, బర్ల పెద్ద మైసయ్య, బర్ల అంజయ్య, మాచర్ల కుమార్, గండి అంజయ్య, రేగు శ్రీశైలం, సానికె వీరస్వామి, యాదగిరి, చంద్రయ్య తదితరులు ఎర్రజెండాలను ఎగురవేశారు.

ఫాదర్ కొలంబో ఆశయ సాధనకు కృషి చేయాలి



స్టేషన్‌ఘన్‌పూర్ విద్యాజ్యోతి కళాశాలలో మాట్లాడుతున్న బిషప్ ఉడుముల బాల

- బిషప్ ఉడుముల బాల

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మే 1: గ్రామీణ పేద, బలహీన వర్గాలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్య, వైద్యం అందించాలనే లక్ష్యంతో ఫాదర్ కొలంబో నిరంతరం సేవలు అందించారని, ఆయన ఆశయాల సాధన కోసం కృషి చేయాలని వరంగల్ బిషప్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ ఉడుమల బాల పిలుపునిచ్చారు. బుధవారం స్టేషన్‌ఘన్‌పూర్ విద్యాజ్యోతి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న ఫాదర్ కొలంబో స్కూల్‌ను బిషప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఫాదర్ థామస్ కిరణ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలిసారి స్టేషన్‌ఘన్‌పూర్‌లో సీబీఎస్ఈ సిలబస్‌తో హైస్కూల్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. డిగ్రీ కళాశాలలో బీకాం, బీఏ లిటరేచర్ కోర్సులు కొనసాగిస్తూ స్కూల్‌ను స్థాపించామన్నారు. సమావేశంలో విద్యా సంస్థల డిప్యూటీ మేనేజర్ ఫాదర్ జయపాల్, ఫాదర్ అ గస్టీన్ రెడ్డి, ఫాదర్ దాసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి: సీఐ

పాలకుర్తి, మే 1: ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన దర్దెపల్లి, గూడోల్లగూడెం గ్రామాల్లో పాలకుర్తి, కొడకండ్ల ఎస్సైలు సాయి ప్రసన్నకుమర్, శ్రావన్‌కుమార్‌లతో కలిసి ఓటర్లకు అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో గొడవలకు పోకుండా ఓటు వేయాలని సూచించారు.

గుడారాలను తొలగిస్తామన్న వ్యాపారులు

రఘునాథపల్లిలో సద్దుమణిగిన వివాదం

రఘునాథపల్లి, మే 1: మండల కేంద్రంలోని శ్రీరేణుక ఏల్లమ్మ ఆలయం ఆవరణలో ఉన్న గుడారాలను తొలగించేందుకు ఎట్టకేలకు చిరు వ్యాపారులు ముందుకు రావడంతో సమస్య సద్దుమణిగింది. వాస్తవానికి వ్యాపారులు తాత్కలిక గుడారాలు ఏర్పాటు చేసుకొని జీవనోపాధి పొందుతున్నారు. అయితే ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు మూడు రోజుల పాటు శ్రీరేణుక ఏల్లమ్మ, ముత్యాలమ్మ, విజయ దుర్గామాతా ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు గుడారాలను తొలగించాలని కోరారు. దీనికి చిరు వ్యాపారులు ఒప్పుకోలేదు. దీంతో గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమాశర్మతో పాటు జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్ యాదవ్, ఎస్ఐ నరేష్ బుధవారం సాయంత్రం సంఘటన స్థలానికి చేరుకొని వ్యాపారులతో మాట్లాడారు. ఉత్సవాలు ముగిసే వరకు గుడారాలను తొలగించాలని సూచించడంతో వారు అంగీకరించారు. దీంతో మూడు రోజుల నుంచి కొనసాగుతున్న వివాదం సద్దుమణిగింది. చర్చల్లో జడ్పీటీసీ బొల్లం అజయ్‌మణికంఠ, గాదె మహేందర్ రెడ్డి, హరినాథ్, దుబ్బాక నాగేష్, నర్సిరెడ్డి, సత్యనారయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

కొడకండ్ల మే 1 : మండలంలో జరుగుతున్న ఉపాధి పనులపై ఎంపీడీవో కార్యాలయంలో డీఆర్‌డీవో మొగులప్ప బుధవారం సమీక్ష నిర్వహించారు. రానున్న హరితహారానికి సైట్‌లను గుర్తించి అంచనాలను తయారు చేయాలని అన్నారు. ఉపాధి హామీ పని జరుగు ప్రదేశంలో మంచినీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్, నీడ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశాద్రి సూరి, ఇంచార్జి ఎంపీవో ఇందిర, ఏపీవో నరిగె కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఏసీపీ

దేవరుప్పుల, మే1: మండలంలోని పోలింగ్ కేంద్రాలను బుధవారం వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య సందర్శించారు. సమస్యాత్మక గ్రామాలైన నీర్మాల, పెద్దమడూరు, కడవెండి, దేవరుప్పుల పోలింగ్‌బూత్‌లను సందర్శించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి, దేవరుప్పుల ఎస్సై చేరాలుకు సూచించారు. అదేవిధంగా మాధాపురం, పడమటితండ, కోలుకొండ, అప్పిరెడ్డిపల్లె, చిన్నమడూరు, బంజార, సింగరాజుపల్లి, ధరావత్‌తండాలో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం: ఎస్సై

జఫర్‌గడ్, మే 1: కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణతో పాటు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని జఫర్‌గడ్ ఎస్ఐ శీలం రవియాదవ్ విద్యార్థులకు ఉద్బోధించారు. డీవైఎస్‌వో ఆధ్వర్యంలో తమ్మడపల్లి(జి)లో విద్యార్థులకు నిర్వహిస్తున్న మార్షల్ ఆర్ట్స్ ఉచిత శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. శిక్షణను పరిశీలించి కరాటే నేర్చుకుంటున్న బాల బాలికలతో ముచ్చటించారు. శిక్షణలో ప్రతిభ కనబరిచినవారికి బహుమతులు అందిస్తానని అన్నారు. కాగా, బాలలకు నాణ్యమైన శిక్షణ అందిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయికి తీర్చిదిద్దుదుతన్న కరాటే కోచ్ అన్నెపు రాజేందర్‌ను, జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థి సాత్విక్‌ను ఎస్ఐ రవియాదవ్ శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజెందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ అవగాహన సదస్సు

రఘునాథపల్లి, మే 1: విద్యుత్ ప్రమాదాల నివారణ కోసమే వినియోగదారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు జనగామ డీఈ ఎం.లక్ష్మీనారయణ రెడ్డి తెలిపారు. రఘునాథపల్లి సబ్‌స్టేషన్ ఆవరణలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై విద్యుత్‌శాఖ సిబ్బందితో పాటు వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ నెల 2న జనగామ మండలంలో, 3న దేవరుప్పుల, 4న బచ్చన్నపేట, 6న లింగాలఘణపురం, 7న తరిగొప్పుల, నర్మెట మండలాలలో విద్యుత్ భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ మనోహర్ రెడ్డి, ఎస్ఏవో జయరాజ్, ఏఈలు రాహుల్, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

బాలయేసు విద్యార్థులకు ఘన సన్మానం



ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న బాలయేసు యాజమాన్యం

దేవరుప్పుల, మే 1: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన బాలయేసు విద్యార్థులను యాజమాన్యం బుధవారం ఘనంగా సన్మానించింది. 10/10ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఝాన్సీబాయ్, టి.హేమలత, 9/8జీపీఏ సాధించిన విద్యార్థులు యామిని, సుస్మిత, శ్రావ్య, నందినిలను కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజ్ షాలువాలతో సన్మానించి అభినందించారు.

బోర్లు వేసేందుకు కొటేషన్ల ఆహ్వానం

జనగామ కల్చరల్, మే 1: జిల్లాలో ఏ చోటనైనా బోర్లు వేసేందుకు ఆసక్తి గల సంస్థల నుంచి కొటేషన్లు ఆహ్వానిస్తున్నట్లు అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. డీటీహెచ్ రిగ్గుతో 4.5, 6.5 అంగుళాల దయా బోర్ వెల్ డ్రిల్లింగ్, రోటరీ రిగ్గుతో 9.5, 11.5 అంగుళాల దయా బోర్ వెల్ డ్రిల్లింగ్, 6.5, 4.5 దయా అంగుళాల బోర్ వెల్ ఫ్లషింగ్, సైడ్ బోర్ వెల్ డ్రిల్లింగ్ చేయుటకు కొటేషన్లను ఈ నెల 15లోగా మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజనీరు కార్యాలయంలో అందజేయాలని కోరారు.

బీజేపీని ఓడించడమే కార్మికుల లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

జూకంటి నర్సింహులు, హనుమానుల రవి, జూకంటి తిరుపతి, జూకంటి మల్లయ్య, మూలకాల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో ...

సీపీఎం ఆధ్వర్యంలో 138వ మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా పార్టీ కార్యాలయం, నెహ్రూ పార్కు, ఏసిరెడ్డినగర్, ఐలమ్మ నగర్, తహసిల్దార్ కార్యాలయం, గిర్నిగడ్డ, బస్టాండు చౌరస్తా, అంబేద్కర్‌నగర్, ధర్మకంచ లేబర్ అడ్డా, మైనారిటీ కాలనీ, ఏసిరెడ్డి స్మారక కేంద్రం, గ్రెయిన్ మార్కెట్ తదితర కేంద్రాలలో సీపీఎం అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జెండాలను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.అబ్బాస్, జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. లోకసభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, జోగు ప్రకాష్, సుంచు విజేందర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొట్ల శ్రీనివాస్, సత్యపాల్, దస్తగిరి, బాల్నె వెంకటమల్లయ్య, సీహెచ్.ఉపేందర్, పి.కళ్యాణి, జి.శివలింగం, బునాద్రి, కె.వెంకటేష్, రజిత, పి.శంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వం వద్ద కేసీఆర్ పాపాల చిట్టా

(5వ పేజీ తరువాయి)

రాజేశ్వర్‌రెడ్డి ఓ బ్రోకరని వ్యాఖ్యానించారు. జనగామలో అధికార దుర్వినియోగం చేసి, దొంగ ఓట్లతో, ఫోన్ ట్యాపింగ్ చేసి గెలిచాడని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో బీఆర్ఎస్ తరుపున గెలిచిన ఎమ్మెల్యేలపై దర్యాప్తు జరుగుతోందన్నారు. నిజాలు బయటపడగానే వారి శాసన సభ్యత్వం రద్దుకావటం ఖాయమన్నారు. సోనియాగాంధీ చొరవతో తెలంగాణా సాధిస్తే, కేసీఆర్ చెంచాగాళ్లు రాష్ట్రంలో భూదందాకు తెరలేపి అడ్డంగా దోచుకున్నారని విమర్శించారు.

ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ భువనగిరి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేసే కార్యకర్తకు పదవులు దక్కుతాయనటానికి తానే ఉదాహరణ అన్నారు. తనను గెలిపించుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నాగపురి రాజలింగంగౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీలకు ఓటు వేస్తే దేశం అధోగతిపాలవుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, జిల్లా, రాష్ట్ర నాయకులు, వివిధ గ్రామాల కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కాగా సమావేశం అనంతరం కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు బయటపడ్డాయి. రెండు గ్రూపులుగా విడిపోయి గొడవపడ్డారు.

కడియం శ్రీహరికి రాజకీయ సమాధి ఖాయం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య



ఇప్పగూడెంలో మాట్లాడుతున్న రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, మే 1: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కష్టార్జితంలో ఎమ్మెల్యేగా గెలిసిన కడియం శ్రీహరి రాజకీయ సమాధి కావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య విమర్శించారు. బుధవారం ఆయన రాఘవపూర్, ఛాగల్, మీదికొండ, కొత్తపల్లి, తాటికొండ, ఇప్పగూడెం, సముద్రాల, పాంనూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడియం పార్టీ మారడంతో బీఆర్ఎస్‌కు పట్టిన పీడ పోయిందని, పార్టీలో తాలు పోయి నిఖార్సయిన బీఆర్ఎస్ కార్యకర్తలే ప్రస్తుతం ఉన్నారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గుంటూరు కోడలు కడియం కావ్యకు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమన్వయ కమిటీ బాధ్యులు ఆకుల కుమార్, మహేందర్ రెడ్డి, అక్కెనపల్లి బాలరాజు, జక్కుల పరుశరాములు, కనకం గణేష్, పార్టీ మండలాధ్యక్షుడు మాచర్ల గణేష్, వెన్నకూస రాంనర్సయ్య, పొన్నం రంజిత్‌కుమార్, ఇనుగాల నర్సింహరెడ్డి, గంగుల శ్రీనివాస్ రెడ్డి, వంగపండ్ల మహేందర్, వట్టె రత్నాకర్ రెడ్డి, ముక్కెర దశరథ్, కాసాని మల్లయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ అంటే వణుకు..



సమావేశంలో మాట్లాడుతున్న సింధె రామోజీ

కొడకండ్ల మే 1 : కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ పార్టీ అంటే వణుకు అని ఆ పార్టీ మండలాధ్యక్షుడు సింధె రామోజి అన్నారు. లోకసభ ఎన్నికల సందర్భంగా మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలను లేకుండా చేస్తామనడం మూర్ఖత్వం అన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నాయకులు ఇప్పటివరకు ఎన్ని అమలు చేశారో ఆత్మ పరిశీలన చేసుకోవాలని విమర్శించారు. రైతుబంధు పెంపు, మహిళలకు నెలకు రూ.2500, రూ.500లకే వంటగ్యాస్, కల్యాణలక్ష్మి రూ.లక్షతో పాటు తులం బంగారం అదనంగా ఇస్తామన్నా ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. 5 నెలలకే జనాలకు కాంగ్రెస్‌పై నమ్మకం పోయిందన్నారు. ప్రజలు పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్‌కు బుద్ధి చెపుతారని హెచ్చరించారు. సొంత ప్రయోజనాల కోసమే కొంత మంది నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఎ.గాంధీ నాయక్, డి.వెంకటేశ్వర్‌రావు, మేటి సోమరాములు, బాకీ ప్రేంకుమార్, కె.సత్యనారాయణ, జక్కుల విజయమ్మ, సతీష్, రమేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

కొడకండ్ల మే 1: మండలంలోని రామవరంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సమక్షంలో ఆ గ్రామ బీఆర్ఎస్ నాయకులు వందమంది కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోసం కృషి చేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో ఎడెల్లి భూపాల్, మందుల రవి, కాజమ్మ, పరమేశ్వరి, రజిత, వెంకటమ్మ, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు డి.సురేష్ నాయక్, భిక్షపతి, క్రాంతి, మహేందర్ పాల్గొన్నారు.